క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో టీడీపీ నేత చేరిక



కండువా వేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని చెల్లూరుకు చెందిన టీడీపీ నాయకుడు బీమా చెంచయ్య గౌడ్ వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం శ్రీకాళహస్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తొట్టంబేడు కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 30 ఏళ్లుగా టీడీపీలో ఉంటున్నా గ్రామంలోని తమ సామాజిక వర్గానికి ఎలాంటి న్యాయం చేయలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు జీపీ యాదవ్, ప్రేమ్ గౌడ్, హరి గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి గ్రామంలో విజయ గణపతి ఆలయ నిర్మాణానికి బుధవారం జంగాలపల్లె సర్పంచ్ బొర్రా నారాయణ రూ.10,116 విరాళం అందజేశారు. గ్రామస్తులు విరాళాలతో ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిరామయ్య, ఆలయ నిర్వాహకులు భాస్కర్, వెంకటరామిరెడ్డి, వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

నారాయణవనం: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌ను వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు మండల పశువైద్యాధికారులు భార్గవి, కుమార్ తెలిపారు. పెంపుడు జంతువుల నుంచి మనుష్యులకు వ్యాధులు సంక్రమించకుండా నిరోధించడంలో భాగంగా గురువారం పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను నారాయణవనం, పాలమంగళం పశు వైద్యశాలల్లో గురువారం ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. పెంపుడు శునకాల యజమానులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిట్ట కొంచెం..'గీత'ఘనం

- 3 గంటల్లో 300 శ్లోకాలు వల్లెవేసింది
- స్వర్ణ పతకం అందుకుంది



స్వర్ణపతకం, ప్రశంసా పత్రంతో బండారుపల్లె బాలిక నిత్యశ్రీ

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెకు చెందిన మహేశ్వరయ్య, హేమలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ(9) స్వర్ణ పతకం, ప్రశంసా పత్రం అందుకుంది. గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా విశాఖపట్నంలో మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిత్యశ్రీ తన ప్రతిభ చాటింది. శ్రీ మద్భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలలో 700 శ్లోకాలను చూడకుండా 3 గంటల్లో వల్లెవేసింది. ఇందుకుగాను అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా స్వర్ణ పతకం, ప్రశంసా పత్రం అందుకుంది. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామికి బుధవారం వైభవంగా పార్వేట ఉత్సవం నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు,మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ధర్మరాజస్వామి వార్షిక ఉత్సవాలు ముగిశాయి.

రోడ్డెక్కిన మురుగు



తొట్టంబేడు (శ్రీకాళహస్తి): పట్టణంలో ఇసుకదిబ్బ సమీపంలోని నంది విగ్రహం ఎదురుగా ఉన్న వీధిలో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పారుతూ దుర్గంధం చిమ్ముతోంది. నీరు నిలిచి ఉండడంతో దోమలకు ఆవాస కేంద్రంగా మారింది. ఇకనైనా అధికారులు మురుగు కాలువలు నిర్మించి పారిశుద్ధ్యం సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశ్రేయస్సే సీఎం ధ్యేయం



హాజరైన ప్రజలు



సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- 'జగనన్న సురక్ష'కు విశేష స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం మండలంలోని నీర్పాకోటలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, గ్రామ సర్పంచ్ అరణి విద్యానాథరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. జగనన్న సురక్షకు సంబంధించి వివిధ ధ్రువపత్రాల కోసం 711 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఇందులో వీటికి సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు 272 మందికి, ఆదాయ సర్టిఫికెట్లు 267, రేషన్ కార్డులు 16, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ 1, ఆధార్ మొబైల్ అనుసంధానం 98, హౌస్ హోల్డ్ మార్పులు 4 చొప్పున ఎమ్మెల్యే అందజేసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి సుపరిపాలన అందిస్తుంటే, టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా మాత్రం దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అర్హుల ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తుంటే, గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారంగా దోచుకున్నాయని దుయ్యబట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ ఫలాలను అందించిన ఘనత తమ సీఎంకే దక్కిందని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం చేయలేనన్ని మంచి పనులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన నాలుగేళ్లలో పూర్తి చేసి, ప్రజల హృదయాలను గెలుచుకుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లోనూ తమ పార్టీని ఆశీర్వదించి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, సురుటుపల్లె దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు మణినాయుడు, తులసీరామ్, నిరంజన్‌రెడ్డి, హరిబాబు, ఎంపీడీఓ నరసింహరావు, డీటీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బందిపై ఆగ్రహం

మండలంలోని ఐకేపీ కార్యక్రమానికి గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడంతో సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని హితవు పలికారు.

నేడు గోవర్ధనగిరిలో..

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి సచివాలయంలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారని చెప్పారు.

ఇళ్ల ముంగిటకే పథకాల ఫలాలు

- చెన్నేరిలో 196 కుటుంబాలకు పథకాల లబ్ధి రూ.2.78 కోట్లు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- గిరిజన కాలనీలో నీటివసతి కల్పన



చెన్నేరిలో మహిళలకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలో ఇళ్ల ముంగిటకే పథకాలు ఫలాలు అందిస్తున్న ఘనత తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం మండలంలోని దాసుకుప్పం పంచాయతీ చెన్నేరిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మాట్లాడారు. గ్రామ పరిధిలో 196 కుటుంబాలు వివిధ పథకాల రూపేణా రూ.2.78 కోట్లు లబ్ధి పొందాయని, అలాగే అమ్మ ఒడి పథకం కింద 126 మంది పిల్లలకు రూ.21 లక్షలు తల్లుల ఖాతాలో జమ చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ నాలుగేళ్ల పాలనలో గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ పాలనలో ప్రజలకు ఏం చేశారో ఆ పార్టీ నాయకులను నిలదీయాలన్నారు.

అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం

చెన్నేరి అంగన్‌వాడీ కేంద్రంలో స్వాతి కుమార్తె ఎస్.యశ్వనికి ఎమ్మెల్యే అన్నప్రాసన చేశారు. గ్రామానికి చెందిన ఆలీసా, జ్యోత్స్న, నాగరత్నం, లావణ్యకు ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ పి. విజయలక్ష్మి కలసి సీమంతం చేశారు. పౌష్టికాహారం, పాలు, గుడ్లు క్రమం తప్పకుండా తీసుకొని రక్తహీనత సమస్యను అధిగమించాలని సూచించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

అరుంధతి వాడలో దారిసమస్యను పరిష్కరించాలని, అలాగే అరుంధతి వాడ, దాసరివాడల్లో సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కోరారు. అంగన్‌వాడీ భవనాన్ని ఆధునీకరించాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్త కాలనీలలో రోడ్డు అధునీకరణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

తాగునీటి వసతి కల్పన

గిరిజన కాలనీలో నీటి సమస్య లేకుండా జెడ్పీటీసీ నిధులతో బోరు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్ ఏ. రవిరెడ్డి, ఎంపీటీసీ బాలయ్య రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బొప్పన సోమశేఖర్, తహసీల్దార్ షేక్ జరీనా, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, పంచాయతీ, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందస్వామి, శరవణన్, రాబర్ట్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాక



విమానాశ్రయంలో పూనం మాలకొండయ్యకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనం మాలకొండయ్యకు బుధవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆమెకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుపతికి వెళ్లారు.

ట్రాన్స్ మినీ మూవీ షూటింగ్ ప్రారంభం



షూటింగ్‌లో నటీ నటులు

శ్రీకాళహస్తి: మండలంలోని రామాపురం రిజర్వాయర్ వద్ద ఉన్న అంజూరు మండపంలో బుధవారం పీఆర్ మ్యూజికల్ చానల్ వారి ట్రాన్స్ మినీ మూవీ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. నటులు సాంబా రషీద్ క్లాప్ కొట్టారు. ఈ షూటింగ్‌లో స్థానిక కళాకారులకు అవకాశాలు ఇస్తున్నట్టు చెప్పారు. నటీనటులు ప్రజ్వల్, మేర్లపాక ఉష, పొట్టిమామ, కవిత, పసల కృష్ణయ్య నటిస్తున్నారు. దర్శకత్వం: రాజ్‌కుమార్, కెమెరా : నరేష్, సంగీతం : షారుఖ్ చేస్తున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని కారణి గ్రామ దళితవాడలో గ్రామస్తులు పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అంబలి పోసి మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, వైస్ ఎంపీపీ మునెమ్మ, నాయకులు రమణయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

పొన్నియమ్మ జాతరలో ఎమ్మెల్యే

పిచ్చాటూరు: నాగలాపురం మండలం కస్తూరినాయుడు కండ్రిగలో బుధవారం రాత్రి పొన్నియమ్మ జాతరలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు పలికారు. గ్రామ సర్పంచ్ మునియమ్మ ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, నాయకులు సుబ్రమణ్యం, జయప్రకాష్, దేశప్పన్, కుప్పయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై హర్షం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలకసంఘ అభివృద్ధికి, కన్నలి కాలువ నిర్మాణానికి రూ.1.59 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు రూ.7.64 కోట్లు నిధులు విడుదల చేయడంపై పురపాలక సంఘ మాజీ ఫ్లోర్‌లీడర్ మిద్దెల హరి హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, నిధుల విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కన్నలి కాలువ పీడిత ప్రజలు, పట్టణ ప్రజల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే ఇంత పెద్దమొత్తంలో నిధులు విడుదల చేయించడం ఆనందంగా ఉందన్నారు.

వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని భరద్వాజతీర్థంలో బుధవారం శ్రీకాళహస్తి వన్నెరెడ్డి జాగృతి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి. గోవర్ధన్‌రెడ్డి, మద్రాస్ గజేంద్రరెడ్డి, న్యాయ సలహాదారుడిగా సున్నపు లక్ష్మీపతిరెడ్డి, అధ్యక్షులుగా మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా సాంబయ్యపాళెం శివారెడ్డి, మహేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చింతకాయల సుధాకర్‌రెడ్డి, కార్యదర్శులుగా హేమంత్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, కోశాధికారిగా కోనేరుగారి చంద్రారెడ్డి, సభ్యులుగా జగదీష్‌రెడ్డి, దీపక్‌రెడ్డి, పుదూరు శ్రీనివాసులురెడ్డి, మునేందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, చందన ప్రకాష్‌రెడ్డి, వినాయక రెడ్డిని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ, త్వరలో నూతన కార్యాలయం ప్రారంభించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీని మూయించింది చంద్రబాబే!



షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రేణిగుంట: మండలంలో గాజులమండ్యంలోని ఎస్వీ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీని 2014లో చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే మూసివేసి, కార్మికుల కడుపు కొట్టారని ఫ్యాక్టరీ కార్మిక సంఘ నాయకులు మండిపడ్డారు. టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు మూయించిన కర్మాగారాన్ని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే పునఃప్రారంభించారన్నారు. అయితే మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరోసారి మూతవేసి కార్మికులను నిలువునా దగా చేశారని, అప్పట్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ముద్దుకృష్ణమనాయుడు ప్రైవేటు చక్కెర కర్మాగారాలకు ప్రయోజనం కల్పించేందుకు కుట్రపన్ని, ఈ షుగర్ ఫ్యాక్టరీని మూయించారన్నారు. ఇప్పుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రాజకీయ విమర్శలు చేయడం ఎంతమాత్రమూ తగదని, తమ సమస్యను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దని హితవు పలికారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు



వీఆర్‌కండ్రిగలో పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు

సత్యవేడు: ఈ–పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, దీనివల్ల రైతులకు చాలా ఉపయోగం కలుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. బుధవారం సాయంత్రం వెంకటరాజుల కండ్రిగలో పత్తి పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, 2023లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా, అన్ని రకాల ప్రభుత్వం సేవలు అందుతాయన్నారు. అనంతరం రైతులకు చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రడ్డి, ఏడీఏ సుబ్రమణ్యం, ఏఓ మురళి, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ,రైతులు పాల్గొన్నారు.

పూలసాగుతో అధిక ఆదాయం



పూల పంటను పరిశీలిస్తున్న భాస్కరయ్య

నారాయణవనం: కొద్దిపాటు భూమి ఉన్న రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పూల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. బుధవారం మండలంలోని అరణ్యంకండ్రిగ రైతుభరోసా కేంద్ర పరిధిలో సాగవుతున్న సంపెంగ, గులాబి తోటలను ఆయన పరిశీలించారు. ఆర్బీకేలో రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, పూలకు మంచి డిమాండ్ ఉందని, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందన్నారు. సంపెంగ పూల తోటకు తామర, మొగ్గతొలచు పురుగులు, దుంపకుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు ఆశిస్తున్నట్టు గుర్తించినట్లు చెప్పారు. అలాగే గులాబీ తోటల్లో మొగ్గ తొలిచే పురుగులు, పేను బంక, పెంకు పురుగులు ఆశించాయని, ఆర్బీకేలో హార్టికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి తెగుళ్ల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎరువులు, సస్యరక్షణ యాజమాన్యం, కలుపు నిర్మూలన పద్ధతులను వివరించారు. తక్కువ నీటితో మొక్కలకు నీరు సంపూర్ణంగా అందడానికి మల్చింగ్ షీట్స్, డ్రిప్ ఇరిగేషన్‌తో సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుని డ్రిప్ ఇరిగేషన్‌కు రైతులు మొగ్గు చూపాలని కోరారు. ఏడీఈ రమేష్, వ్యవసాయ అధికారులు శోభారాణి, వేణుగోపాల్, ఉద్యానవన అధికారి వెంకట సౌజన్య, ఆర్బీకే ఇన్‌చార్జి మోహన్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



చిన్నారుల తల్లిదండ్రులతో చంద్రశేఖర్ తదితరులు

శ్రీకాళహస్తి: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రజాప్రగతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం గిరిజన కాలనీల్లో పాఠశాలలకు సక్రమంగా రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని, విద్య వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. టీఎంవీకండ్రిగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి మాట్లాడుతూ, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి వంటి పథకాలను విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఆధార్ సమస్య ఉంటే పరిష్కరిస్తామని గ్రామ సచివాలయ కార్యదర్శి హేమశ్రీ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి దివ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్ట్ సిబ్బంది చెంచురామిరెడ్డి, వలంటీర్లు భారతి, రుక్మిణి, చామంతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోశాల తనిఖీ

- పుంగనూరు జాతి దూడ జననం



గోశాలను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ గోశాలను బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తనిఖీ చేశారు. గోశాలలో సంకర జాతికి చెందిన లేగదూడ, పుంగనూరు ఆవు జాతికి చెందిన దూడ జన్మించడంతో ఆయన పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. వీటి సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గోశాల సిబ్బందిని ఆదేశించారు. అలాగే గోశాలలో ఆవుల సంరక్షణ, గోవులకు పెడుతున్న దాణా, పచ్చిగడ్డి, ఎండుగడ్డి నాణ్యత? ఎంత సరఫరా చేశారు? వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. దాణా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గోమాతలకు నాణ్యమైన దాణా ఇవ్వాలని, వర్షాకాలం ప్రారంభం కావడంతో గోవులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి, గోశాల సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వేమాలమ్మను దర్శించుకున్న చైర్మన్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం పెద్దకనపర్తిలో నిర్వహిస్తున్న వేములమ్మ జాతరలో అమ్మవారిని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకుత గ్రామస్తులు స్వాగతం పలికి సత్కరించారు.కార్యక్రమంలో రామమూర్తి, రఘురామయ్య, ఉదయ్‌కుమార్,వసంతరావు, వీరస్వామి, వెంకీ రాయల్,కృష్ణ, శేఖర్ శివ, పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు



ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నీర్పాకోటలోని శ్మశానవాటికలో ముళ్ల పొదలను మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, గ్రామ సర్పంచ్ అరణివిద్యానాథరెడ్డి జేసీబీతో తొలగించారు. ముళ్ల పొదల మూలాన అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామస్తులు విద్యానాథరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుని ఆ ప్రాంతాన్ని చదును చేయించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇదో మహత్తర కార్యక్రమం

- 'జగనన్న సురక్ష' శిబిరంలో పవిత్రారెడ్డి
- తొట్టంబేడులో 422మందికి సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ప్రజాసమస్యల పరిష్కారానికి, మరిన్ని సేవలు చేరువ చేయడానికే ప్రభుత్వం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. బుధవారం తొట్టంబేడు 1, 2 సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. పవిత్రా రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి సమస్యలున్నా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే అవసరం లేకుండా అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి సర్టిఫికెట్లు, సేవలు అందివ్వడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఇదో మహత్తర కార్యక్రమమని, ఇంతవరకు ఏ రాష్ట్రం కూడా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించలేదన్నారు. ప్రజల విజ్ఞప్తిపై స్పందించి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తొట్టంబేడుకు రూ.1.2కోట్లతో తారురోడ్డు వేయించారన్నారు. అలాగే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారని, మురుగు కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయించారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఈ సమస్యలను పట్టించుకోలేదని ప్రజలే చెబుతున్నారన్నారు. ప్రజలకు ఎమ్మెల్యే ఎల్లప్పుడూ అందుబాటు ఉన్నారన్నారు. అనంతరం తొట్టంబేడు-1లో 174 మంది, సచివాలయం-2లో 248 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్చనాదేవి, వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ, తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌బాబు, నాయకులు మునిరత్నం, చంద్రయ్య నాయుడు, భాస్కర్, వెంకీ, గంగాధర్, రవి, కొన్నలి రమేష్, కన్నలి భాస్కర్ రెడ్డి రాజేష్, ధర్మయ్య, రవీంద్ర నాయుడు, మాబాషా, షబ్బీర్, షరీఫ్, జగదీశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, నాగేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష



ఏర్పేడు : రాజులపాలెంలో..

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక, రాజులపాలెం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పేదలకు జగనన్న సురక్ష కార్యక్రమంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచులు గంగాధరం, సుబోస్ చంద్రబోస్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, పార్టీ నాయకులు వరదయ్య, రత్నయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.